

నర్సీపట్నం డీఎస్పీగా జీఆర్ఆర్ మోహన్



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ మోహన్

నర్సీపట్నం, ఫిబ్రవరి 28: నర్సీపట్నం డీఎస్పీగా జీఆర్ఆర్ మోహన్ బుధవారం రాత్రి విధులు చేపట్టారు. ఇక్కడ డీఎస్పీగా పని చేసిన బి.వెంకటరామయ్య ఈ నెల 25న బదిలీ అయిన విషయం తెలిసిందే. ఏలూరులో ఏసీబీ డీఎస్పీగా పని చేస్తున్న మోహన్‌ను నర్సీపట్నం డీఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది.

నిజం గెలవాలి

- నేడు, రేపు మూడు నియోజకవర్గాల్లో పర్యటించనున్న నారా భువనేశ్వరి
- చంద్రబాబు అరెస్టుతో మృతిచెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- పార్టీ తరపున ఆర్థిక సాయం అందజేత



నర్సీపట్నంలో భువనేశ్వరికి స్వాగతం పలికిన అయ్యన్న, పద్మావతి దంపతులు, తెలుగు మహిళలు

అనకాపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి గురువారం నుంచి రెండు రోజులపాటు జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడంతో తీవ్రమనస్తాపానికి గురై అప్పట్లో మృతిచెందిన టీడీపీ శ్రేణుల కుటుంబాలను 'నిజం గెలవాలి' పేరుతో ఆమె పరామర్శించనున్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించిన భువనేశ్వరి రాత్రి 8.45 గంటలకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం చేరుకున్నారు. రాత్రికి ఇక్కడే ప్రత్యేక బస్సులో ఆమె బస చేశారు.

చోడవరం నియోజకవర్గంలో..

నర్సీపట్నం నుంచి గురువారం ఉదయం 10 గంటలకు బయలుదేరి 10.30 గంటలకు చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలం జేపీ అగ్రహారం చేరుకుంటారు. చంద్రబాబు అరెస్టుతో మనస్తాపం చెంది ప్రాణాలు వదిలిన సుర్ల దేముడమ్మ, కొవ్వూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తారు. అనంతరం 12.40 గంటలకు బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం గ్రామానికి చేరుకుని అప్పలబత్తుల అయ్యన్నాచారి కుటుంబ సభ్యులను, 2.15 గంటలకు ... మిగతా 8వ పేజీలో

నర్సీపట్నం చేరుకున్న భువనేశ్వరి

- ప్రత్యేక బస్సులో రాత్రి బస

నర్సీపట్నం, ఫిబ్రవరి 28: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన ముగించుకుని బుధవారం రాత్రి 8.45 గంటలకు నర్సీపట్నం చేరుకున్నారు. పెద్దబొడ్డేపల్లి నుంచి మాకవరపాలెం వెళ్లే రోడ్డులో వున్న రాయల్ పార్కు రిసార్ట్స్ వద్ద మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఆయన భార్య పద్మావతి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. చింతకాయల పద్మావతి హారతి ఇచ్చారు. నాగజగదీశ్వరరావు పుష్పగుచ్ఛం అందజేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన తెలుగు మహిళా కార్యకర్తలను, నాయకులను అయ్యన్నపాత్రుడు ఆమెకు పరిచయం చేశారు. ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు దాడి రత్నాకర్, తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి సుకల రమణమ్మ, కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భువనేశ్వరి ప్రత్యేక బస్సులో రాత్రి బస చేశారు.



ఆడారిమెట్టలో మాట్లాడుతున్న భువనేశ్వరి

గిరిజనుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

ఆదివాసీలకు ఎన్నో పథకాలు అమలు చేశారు

- అరకు కాఫీని దేశ, విదేశాల్లో ప్రమోట్ చేసింది ఆయనే
- పాడేరు మండలం ఆడారిమెట్ట సభలో నారా భువనేశ్వరి

పాడేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని ఆయన సతీమణి భువనేశ్వరి తెలిపారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ ఆడారిమెట్టలో బుధవారం గిరిజన మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గిరిజనులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్న దూర దృష్టితో చంద్రబాబు అనేక పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేశారన్నారు. విదేశాల్లో చదువుకునేందుకు ఎన్‌టీఆర్ విదేశీ విద్యోన్నతి, గిరిజన గర్భిణులు, బాలింతలకు గిరి గోరుముద్ద, చిన్నారులకు బాలామృతం, పుట్టిన బిడ్డలకు బేబీ కిట్ పథకాలను అమలు చేశారన్నారు. ఆస్పత్రిలో పురుడు పోసుకున్న తరువాత తల్లీబిడ్డలను ఇంటికి సురక్షితంగా పంపేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్సులను, మారుమూల ప్రాంతాల్లో రోగుల కోసం ఫీడర్ అంబులెన్సులను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజన బిడ్డల కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం అమలు చేశారన్నారు. జగన్ సీఎం అయ్యాక గిరిజనుల కోసం ఉన్న ఈ పథకాలన్నీ రద్దు చేశారన్నారు.

అరకు ప్రాంత ప్రాధాన్యతను, అరకు కాఫీని చంద్రబాబు దేశ, విదేశాల్లో బాగా ప్రమోట్ చేశారని భువనేశ్వరి చెప్పారు. బుధవారం ఉదయం ఆయన (చంద్రబాబు) తనకు ... మిగతా 8వ పేజీలో

ధర్మశ్రీ నన్ను కొట్టారు

విశాఖ డెయిరీలో చర్చల కోసం వెళితే చెయ్యి చేసుకున్నారు

- వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ సన్యాసిరావు ఆవేదన
- ఎమ్మెల్యే తీరుకు నిరసనగా పదవికి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో ధర్మశ్రీకి టికెట్ ఇస్తే మద్దతు ఇవ్వబోమని విస్పష్టం



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 28: చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తనను దుర్భాషలాడడమే కాకుండా తనపై చేయి చేసుకున్నారని మండలంలోని వడ్డాది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం వడ్డాదిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వడ్డాది మేజర్ పంచాయతీలో ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌ను పక్కనపెట్టి, పంచాయతీ పాలకవర్గంతో సంబంధంలేని వైసీపీ గ్రామ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తికి అధికారాలను ఎమ్మెల్యే అప్పగించారని విమర్శించారు. అప్పటి నుంచి పంచాయతీ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు, వంటి వాటిలో అవినీతి జరుగుతున్నదని, దీనివల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తున్నదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే ధర్మశ్రీ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. దీంతో ఇటీవల మీడియా సమావేశం ఏర్పాటు చేసి, తమ ఆవేదనను వ్యక్తం చేశామని చెప్పారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో విశాఖ రావాలని చైర్మన్ ఆనంద్ తమకు కబురుపెట్టారని తెలిపారు. ఆదివారం విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో మంత్రి అమర్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సమక్షంలో ఎమ్మెల్యే ధర్మశ్రీతో రాజీ సమావేశాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ధర్మశ్రీ వ్యవహారశైలిపై పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఇంతలో ధర్మశ్రీ అనుకూల వర్గమైన జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ఆధ్వర్యంలో పలువురు లోపలికివచ్చి పెదపూడి సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావుపై దాడి చేసి కొట్టారన్నారు. దీంతో తీవ్ర అసహనం చెందిన ఆడారి ఆనంద్‌కుమార్.. అందరినీ బయటకు వెళ్లిపోవాలని ఆదేశించడంతో వెలుపలికి వచ్చామన్నారు. తరువాత దొండా రాంబాబు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీలు తనను అసభ్య పదజాలంతో దూషించారని ఆయన చెప్పారు. తాను కూడా దూషించడంతో ఎమ్మెల్యే ధర్మశ్రీ తనపై చెయ్యి చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో ఇంతవరకు ఎవరితోనూ ఒక్క మాట పడలేదని, అలాంటిది ఎమ్మెల్యే ధర్మశ్రీ తనపై చెయ్యి చేసుకోవడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని సన్యాసిరావు అన్నారు. ఇందుకు నిరసనగా వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధిష్ఠానం చోడవరం టికెట్‌ను ధర్మశ్రీకి కేటాయిస్తే.. ఆయనకు మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. మండలంలో ధర్మశ్రీ తీరును వ్యతిరేకించే వారితో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, రాజకీయంగా తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. కాగా పీఏసీఎస్ చైర్‌పర్సన్ సన్యాసిరావుపై ఎమ్మెల్యే ధర్మశ్రీ చెయ్యి చేసుకోవడానికి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ దొండా కన్నబాబు, వడ్డాది ఉపసర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి భర్త సూరి అప్పారావు, పంచాయతీ వార్డు మెంబర్ దొండా నరేశ్, నాయకులు సయ్యపురెడ్డి నవీన్, అడపా నరసింహమూర్తి తదితరులు ఖండించారు. సమావేశంలో దొండా అచ్చియ్యదొర, దొండా శ్రీను, శిరిగిరిశెట్టి చిన వెంకయ్యదొర, దొండా కుమార్, అదర్రావు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ధర్మశ్రీ వ్యతిరేక వర్గీయులు

విస్సన్నపేట భూములపై సర్వే

వివిధ శాఖలకు చెందిన తొమ్మిది మందితో కమిటీ వేసిన కలెక్టర్

- వివాదాస్పద భూములను పరిశీలించిన అధికారులు
- రెండు రోజులపాటు సమగ్ర సర్వే
- ఎవరి భూమి ఎంతెంత ఉందో నిగ్గు తేలుస్తామని వెల్లడి



విస్సన్నపేటలో భూములను పరిశీలిస్తున్న అధికారుల బృందం

కశింకోట, ఫిబ్రవరి 28: **మండలంలోని విస్సన్నపేట రెవెన్యూ పరిధిలో వివాదాస్పద భూములను తొమ్మిది మందితో కూడిన ప్రత్యేక బృందం బుధవారం సందర్శించింది. ఇక్కడ ప్రభుత్వ భూమి ఎంత? జిరాయితీ భూమి ఎంత? అన్నది తేల్చడానికి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహిస్తామని బృందంలోని అధికారులు తెలిపారు. రైతుల సమక్షంలో రెండు రోజుల్లో సర్వేను పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని చెప్పారు.**

కశింకోట మండలం విస్సన్నపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 195/2లో సుమారు 610 ఎకరాలు ఉండగా ఇందులో 300 ఎకరాలు జిరాయితీ, మరో 300 ఎకరాలు ప్రభుత్వ బంజరు, సీలింగ్, డి.పట్టా భూములు, కొండలు ఉన్నాయి. ఈ భూములను ఆనుకొని 49.66 ఎకరాల్లో రంగబోలు గెడ్డ ఉంది. ఈ భూములపై కన్ను వేసిన వైసీపీ నాయకులు భారీ లేఅవుట్‌కు ప్రణాళికను తయారు చేశారు. వందలాది చెట్లను నరికివేశారు. యంత్రాలతో ఎత్తుపల్లాలను సరి చేశారు. వాగులు, గెడ్డలను మట్టి, రాళ్లతో కప్పేసి చదును చేశారు. ఈ పనులకు సంబంధించి ఏ ఒక్క ప్రభుత్వ శాఖ నుంచి కూడా అనుమతులు పొందలేదు. అధికారం చేతిలో వుండడంతో ప్రకృతి విధ్వంసానికి పాల్పడ్డారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. అయితే భూదందాకు తెరవెనుక అధికార పార్టీకి చెందిన పెద్ద నాయకులు ఉండడంతో జిల్లాస్థాయి అధికారులు తొలుత పట్టించుకోలేదు. 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనాలు రావడంతో అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్ స్పందించి, పలువురు అధికారులతో కమిటీని వేశారు. కొద్ది రోజుల తరువాత ఈ కమిటీ నివేదిక ఇచ్చింది. కానీ ఇంతవరకు బహిర్గతం చేయలేదు.

ఇదిలావుండగా జిల్లా కలెక్టర్ తాజాగా వివిధ శాఖలకు చెందిన తొమ్మిది మంది అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిసింది. విస్సన్నపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 195/2లోని భూములను పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. దీంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి, సర్వే శాఖ ఏడీ ఎస్.గోపాలరాజు, జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్.జానకీదేవి, మైన్స్ ఏడీ సుబ్బారాయుడు, ఇరిగేషన్ ఎస్‌ఈ కె.సూర్యకుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి నాగిరెడ్డి, తహసీల్దార్ మధుసూదన్ తదితరులు బుధవారం విస్సన్నపేట రెవెన్యూ పరిధిలో వివాదాస్పద భూములను పరిశీలించారు. ఇనాం భూములను 1969లో ఇద్దరికి మాత్రమే ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసిందని, కాలక్రమేణా 11 మంది సాగుదారులు వున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. సర్వే నంబరు 195/2లో సుమారు 610 ఎకరాలు ఉండాలని, కానీ ఆన్‌లైన్ అడంగల్‌లో వెయ్యి ఎకరాలు ఉన్నట్లు చూపుతున్నదని చెప్పారు. కాగా ఇదే సర్వే నంబర్‌లో తమకు సుమారు 250 ఎకరాల జిరాయితీ భూమి ఉందని రాంబిల్లి మండలానికి చెందిన ముగ్గురు రాజులకు చెబుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వ భూమి ఎంత ఉంది? జిరాయితీ భూమి ఎంత? అన్నది నిర్ధారిస్తామని అధికారులు చెప్పారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసి సరిహద్దులను నిర్ణయిస్తామని, అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఐదేళ్ల నుంచి ఇంతే!

జల్లూరు వంతెనపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- టీడీపీ హయాంలో 2018లో శంకుస్థాపన
- సాధారణ ఎన్నికలనాటికి పిల్లర్లు, శ్లాబ్ వరకు పూర్తి
- వైసీపీ ప్రభుత్వ ఆదేశాలతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- ఇప్పటి వరకు అతీగతీలేని వైనం
- అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.2.2 కోట్లు అవసరం
- ప్రతిపాదనలకే పరిమితమైన నిధులు మంజూరు



అసంపూర్తిగా ఉన్న జల్లూరు వంతెన. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే పరిస్థితి! (ఇన్‌సెట్‌లో) శిథిలావస్థకు చేరిన పాత వంతెన

కోటవురట్ల, ఫిబ్రవరి 28:

తెలుగుదేశం హయాంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలనే కాదు.. అభివృద్ధి పనులను కూడా వైసీపీ ప్రభుత్వం భ్రష్టుపట్టించింది. మండలంలో జల్లూరు వద్ద వరహా నదిపై అసంపూర్తిగా వున్న వంతెన నిర్మాణమే ఇందుకు ఒక ఉదాహరణ. టీడీపీ హయాంలో చేపట్టిన ఈ వంతెన నిర్మాణ పనులను వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిలుపుదల చేయించింది. ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు కదలలేదు. కొత్తవంతెన అందుబాటులోకి రాకపోవడంతో నర్సీపట్నం-అడ్డరోడ్డు మధ్య వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలోని జల్లూరు వద్ద వరహా నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలస్థితికి చేరడంతో ఇక్కడ కొత్త వంతెన నిర్మాణానికి టీడీపీ హయాంలో రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణ పనులకు 2018 జనవరి 5వ తేదీన అయ్యన్నతోపాటు నాటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేశారు. 2019 ఫిబ్రవరినాటికి రూ.2.3 కోట్ల మేర పనులు పూర్తికావడంతో ఆ మేరకు బిల్లులు మంజూరయ్యాయి. తదుపరి పనులు కొనసాగిస్తుండగా సాధారణ ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అప్పటికి మరో రూ.15 లక్షల విలువైన పనులు జరిగాయి. దాదాపు మూడేళ్లపాటు వంతెన నిర్మాణం విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. తరువాత 2022 మార్చిలో కాంట్రాక్టర్‌కు రూ.15 లక్షలు చెల్లించి, నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు కోరారు. అయితే సిమెంటు, స్టీలు, ఇసుక, పిక్క ధరలు, కూలి రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని, పాత రేట్లకు పనులు చేయలేనని కాంట్రాక్టర్ స్పష్టం చేశారు. అంతేకాక అగ్రిమెంట్ గడువు ముగిసినందున టెండర్ రద్దు చేయాలని ఆయన కోరారు. కాగా జల్లూరు వంతెన పనులపై నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ ఏఈ నారాయణరెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. వంతెన శ్లాబ్ పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని, రెండువైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.2.2 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అదే విధంగా పాత టెండర్ రద్దు చేసి, మళ్లీ టెండర్ పిలవడానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు.

ఎలమంచిలి ఫ్లై ఓవర్ వంతెనపై నేటి నుంచి రాకపోకలు

- పనులు పూర్తి కావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు అనుమతి

రైల్వే ఫ్లై ఓవర్ వంతెన



ఎలమంచిలి, ఫిబ్రవరి 28: ఎలమంచిలి వద్ద నిర్మాణం పూర్తయిన రైల్వే ఫ్లైఓవర్ వంతెన మీదుగా గురువారం నుంచి వాహనాల రాకపోకలకు అనుమతించనున్నట్టు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. సుమారు 15 సంవత్సరాల క్రితం 35 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో చెల్లించక పోవడం, ఇరువైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి భూ సేకరణలో తీవ్ర జాప్యం, కాంట్రాక్టర్లు మారడం వంటి కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఇటీవల పనులు పూర్తికావడంతో ఈ నెల 22వ తేదీన రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. అయితే కొద్దిపాటి పనులు మిగిలి వుండడంతో వాహనాల రాక పోకలకు అనుమతించలేదు. ఆయా పనులు బుధవారంతో పూర్తికావడంతో గురువారం నుంచి కొత్త వంతెన మీదుగా రాకపోకలు సాగించవచ్చని అధికారులు ప్రకటించారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

జిల్లాలో 38 కేంద్రాలు

- మొత్తం విద్యార్థులు 28,621 మంది
- ఫస్టియర్-13,323, సెకండియర్ 15,298 మంది
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
- సీసీ కెమెరాలు ఏర్పాటు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా 'నో ఎంట్రీ'



గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

అనకాపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): **ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాని పట్టణ ప్రాంతాల్లో తొమ్మిది, గ్రామీణ ప్రాంతాల్లో 29... మొత్తం 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.**

కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశాల మేరకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సుజాత పర్యవేక్షణలో విద్య, పోలీసు, విద్యుత్, పీటీడీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఆయా కేంద్రాల్లో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు ఇప్పటికే హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారమే మార్చి ఒకటో నుంచి 19వ తేదీ వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, రెండో తేదీ నుంచి 20వ తేదీ వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో ఫస్టియర్ పరీక్షలకు 13,323 మంది, సెకండియర్ పరీక్షలకు 15,298 మంది... మొత్తం 28,621 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్, సీసీ కెమెరాలు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అన్ని కేంద్రాల్లో ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

బైక్ అదుపుతప్పి.. యువకుడి మృతి


సన్యాసిరావు (ఫైల్)

నక్కపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని గొడిచెర్ల హైవే జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి 11 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు నక్కపల్లి హెచ్‌సీ కిశోర్ బుధవారం చెప్పారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనకాపల్లి గాంధీనగర్‌కు చెందిన సన్నిధి సన్యాసిరావు(32) ప్రైవేట్ ల్యాబ్‌లో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. బైక్‌పై కాకినాడ వెళుతుండగా ప్రమాదవశాత్తూ బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

శారదా నదిలో మునిగి వృద్ధుడి మృతి

చోడవరం, ఫిబ్రవరి 28: మండలంలోని గవరవరం గ్రామం వద్ద శారదా నదిలో ప్రమాదవశాత్తూ మునిగిపోయిన వృద్ధుడు మృతిచెందాడు. గవరవరం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మార్టూరు దేముళ్లు (60) మంగళవారం సాయంత్రం పొలానికి వెళ్లాడు. చీకటి పడిన తరువాత ఇంటికి తిరికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు గాలించారు. అయినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. కాగా బుధవారం మధ్యాహ్నం శారదా నదిలో ఇసుక తవ్విన గొయ్యి వద్ద దేముళ్లు మృతదేహం కనిపించింది. శారదా నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, దీనివల్ల ఏర్పడి గోతుల్లో పడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేముళ్ల మృతికి కూడా ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన గొయ్యే కారణమని అన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 28: మండలంలోని దుగ్గాడ గ్రామానికి ఒక యువతి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని రూరల్ అదనపు ఎస్‌ఐ రామారావు తెలిపారు. దుగ్గాడ గ్రామానికి చెందిన నల్లబెల్లి అపర్ణ(19) డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 26వ తేదీన పరీక్ష రాయడానికి నర్సీపట్నం వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. మరుసటి రోజు కూడా ఆచూకీ లేకపోవడంతో యువతి తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అదనపు ఎస్‌ఐ తెలిపారు.

ఎలమంచిలి ఎన్టీఆర్ కాలనీలో చోరీ

» 4 తులాల బంగారు, అర కిలో వెండి అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్, పోలీసులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 28: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. నాలుగు తులాల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి సామగ్రి అపహరణకు గురైంది. దీనికి సంబంధించి పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఎస్.రంగనాయకులు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 23న ఊరు వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారం, వెండి అపహరణకు గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ బృందం ఆధారాలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 28: నునపర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నునపర్తి గ్రామానికి చెందిన రెడ్డి రాజేశ్ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా బుధవారం రాత్రి పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

బాలికను కొట్టారని ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

ఎలమంచిలి, ఫిబ్రవరి 28: పట్టణంలోని కొత్తపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు బుధవారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కొత్తపేట ఉన్నత పాఠశాలలో ఈ నెల 24న ఐదో తరగతి విద్యార్థిని అల్లరి చేస్తుండడంతో ఉపాధ్యాయుడు ఆ బాలికను కర్రతో కొట్టినట్టు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు.

రైల్వే జోన్ భూములపై బీజేపీ, వైసీపీ నాటకాలు

» సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: విశాఖ రైల్వే జోన్‌కు భూముల కేటాయింపుపై కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలు నాటకాలు ఆడుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో ఆరోపించారు. భూములు ఇచ్చినట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా, బీజేపీ ఇవ్వలేదని ప్రకటించడం చూస్తుంటే ప్రజలను గందరగోళంలో పడేసి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. విభజన చట్టంలోని హామీల్లో ఒక్కటి కూడా మోదీ ప్రభుత్వం అమలు చేయలేదని పేర్కొన్నారు. అమలు చేయని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఒత్తిడి చేయడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రానున్న ఎన్నికల్లో గెలవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అన్యాయానికి గురవుతున్న రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

2,65,886 మందికి రైతు భరోసా


నమూనా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, విప్ ధర్మశ్రీ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 2,65,886 మంది రైతులకు రూ.53 కోట్ల 32 లక్షలు జమ చేసినట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీలో 36,643 మంది రైతులకు రూ.6 కోట్ల 90 లక్షల 36 వేలు జమ చేశామన్నారు. అంతకు ముందు తాడేపల్లి నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులు అడ్డగింత


బుచ్చిరాజుపేటలో పనులను అడ్డుకుంటున్న కారిడార్ నిర్వాసిత రైతులు

నక్కపల్లి, ఫిబ్రవరి 28: విశాఖ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన తమకు పూర్తి స్థాయిలో ప్యాకేజీ ఇచ్చే వరకు ఎటువంటి పనులు చేపట్టకూడదని కారిడార్ నిర్వాసిత రైతులు పునరుద్ఘాటించారు. బుధవారం కారిడార్ భూముల్లో యంత్రాలతో తుప్పలను తొలగించే పనులు చేపడుతుండగా ఈ గ్రామ నిర్వాసిత రైతులు పనులను అడ్డగించారు. సర్పంచ్ కాళ్ల శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు నేతృత్వంలో నిర్వాసిత రైతులు ఆందోళన చేపట్టారు. 18 ఏళ్లు నిండిన నిర్వాసిత రైతులందరికీ ఒక్కొక్కరికీ రూ.15 లక్షలు, ఇళ్లు కోల్పోతున్న వారికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాబ్జీ, ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి సీజీఎఫ్ నిధులు రూ.కోటి మంజూరు

» చైర్మన్ మురళీకృష్ణ


జీవో కాపీతో మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన పాలక మండలి సభ్యులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో శిథిలావస్థలో ఉన్న క్యూ కాంప్లెక్స్, మండపం పునర్నిర్మాణానికి దేవదాయశాఖ సీజీఎఫ్ నిధులు కింద కోటి రూపాయలు మంజూరు చేసిందని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్‌లు తెలిపారు. నిధులు మంజూరైన జీవోతో బుధవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పాలకమండలి సభ్యులు కలిశారు. సీజీఎఫ్ నిధులు మంజూరు చేయించాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కోరగా ఆయన స్పందించి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ ఎస్. సత్యనారాయణలకు సిఫారసు చేయగా వారు స్పందించారన్నారు. మ్యాచింగ్ గ్రాంటు రూ.60 లక్షలు జోడించి రూ.కోటి 60 లక్షలు అంచనాల నిధులను మంజూరు చేశారని చెప్పారు. నూకాంబిక ఆలయానికి సంబంధించి గతంలో సీజీఎఫ్ నిధులు ద్వారా మొట్ట మొదటిసారిగా అధిక మొత్తంలో మ్యాచింగ్ గ్రాంటు రూ.60 లక్షలు మినహాయించి కోటి రూపాయలు మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే వీటి నిర్మాణ పనులకు అనుమతులు తీసుకుని టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రత్నంపేటలో కార్డన్ సెర్చ్

» ఇళ్లు, ఖాళీ స్థలాలతోపాటు పశువులశాలల్లోనూ తనిఖీలు

» రికార్డులు లేని ఒక కారు, మూడు ఆటోలు, 16 ద్విచక్రవాహనాలు స్వాధీనం

» 2,300 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం


కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ సుబ్బరాజు

రోలుగుంట, ఫిబ్రవరి 28: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అన్ని మండలాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు పేర్కొన్నారు. మండలంలోని రత్నంపేట గ్రామంలో బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు డీఎస్పీ పర్యవేక్షణలో నలుగురు సీఐలు, 12 మంది ఎస్‌ఐలు, 100 మందికిపైగా పోలీసు కానిస్టేబుళ్లతో కార్డన్ సెర్చ్ (విస్తృత తనిఖీలు) నిర్వహించారు. ఈ సమయంలో గ్రామంలో నుంచి ఎవరినీ బయటకు వెళ్లనివ్వలేదు. అదే విధంగా బయట నుంచి ఎవరినీ గ్రామంలోకి రానివ్వలేదు. ఇళ్లు, ఖాళీ స్థలాలు, పశువులశాలలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. సరైన రికార్డులు లేని ఒక కారు, మూడు ఆటోలు, 16 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఒక వ్యక్తి నుంచి ఐదు లీటర్ల సారాను, గ్రామ శివారున సారా తయారీకి సిద్ధం చేసిన 2,300 లీటర్ల బెల్లం పులుసును స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని దేవరాపల్లిలో ఇప్పటికే కార్డన్ సెర్చ్ నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ సురేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: అనకాపల్లిలో మార్చి ఏడో తేదీన నిర్వహించనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం పరిశీలించారు. పిసినికాడ సమీపంలోని కొంత స్థలాన్ని, డీమార్టు సమీపంలోని మరొక స్థలాన్ని మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ పరిశీలించారు. అలాగే హెలిప్యాడ్ కోసం ఎన్టీఆర్ స్టేడియం, కశింకోట ఎంపీడీవో కార్యాలయ ఆవరణను పరిశీలించారు. ముఖ్యమంత్రి నిర్వహించనున్న రోడ్డు షోకు అనువైన మార్గాన్ని కూడా పరిశీలించారు. దీనిపై గురువారం తుది నిర్ణయం తీసుకోనున్నట్టు మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహణ



ఎన్నికల శిక్షణకు హాజరైన వివిధ శాఖల అధికారులు, మాట్లాడుతున్న పి.జయంతి

» జిల్లా ఎన్నికల శిక్షకులు పి.జయంతి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు నిబద్ధత, సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల శిక్షకులు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పి.జయంతి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లాలోని అధికారులకు నిర్వహించిన శిక్షణా తరగతులలో ఆమె మాట్లాడారు. చిన్న పొరపాటుకు కూడా అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా పనిచేయాలన్నారు. వారికి కేటాయించిన విధుల గురించి క్షుణ్ణమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పగించిన విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాఖలో కలకలం

» జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట వార్డు సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

» దళితుడినైన తన పట్ల కమిషనర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ

» ఎడమచేతి మణికట్టు వద్ద బ్లేడ్‌తో కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావం

» అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలింపు


ఆత్మహత్యాయత్నం చేసిన శివ ఆదిమూర్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం రాత్రి వార్డు సచివాలయ ఉద్యోగి ఒకరు చేతి మణికట్టును బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తన పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ పది నెలలుగా సస్పెన్షన్‌లో ఉంచి ఉద్యోగం నుంచి తొలగించాలని యత్నిస్తున్నందునే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్టు సదరు ఉద్యోగి కావటి శివ ఆదిమూర్తి ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

జీవీఎంసీ 45వ వార్డు పరిధిలో 253 సచివాలయంలో శివ ఆదిమూర్తి వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీగా పనిచేసేవారు. వార్డు శానిటేషన్ సెక్రటరీగా ఉద్యోగంలో చేరిన తమతో మురుగునీటి కాలువల్లో పూడికలు తీయిస్తున్నారంటూ ఆందోళన చేయడంతో మూడేళ్ల కిందట ఆయన్ను సస్పెండ్ చేశారు. తర్వాత సస్పెన్షన్ ఎత్తేయడంతో తిరిగి ఉద్యోగంలోకి చేరారు. యూజర్ చార్జీలు వసూలు కోసం శానిటేషన్ సెక్రటరీలపై ఒత్తిడి పెంచుతున్నారని, దీన్ని తాము తట్టుకోలేకపోతున్నామంటూ శానిటేషన్ సెక్రటరీలంతా పది నెలల కిందట జీవీఎంసీ కమిషనర్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ఆ సమయంలో శివ ఆదిమూర్తిని కమిషనర్ సాయికాంత్‌వర్మ సస్పెండ్ చేశారు. తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయాలని కమిషనర్‌తోపాటు సీడీఎంఏ, వార్డు సచివాలయం శాఖ డైరెక్టర్‌ను కలిసినప్పటికీ ఫలితం లేకపోగా, ఆయన్ను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. దీనిపై కమిషనర్‌ను కలిసేందుకు పలుమార్లు యత్నించినా సాధ్యంకాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కమిషనర్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని కోరాలని, లేనిపక్షంలో అక్కడే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో రెండు బ్లేడ్‌లు జేబులో పెట్టుకుని జీవీఎంసీ కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లారు. అప్పటికే కమిషనర్‌తోపాటు ఇతర అధికారులు కూడా వెళ్లిపోవడంతో పోర్టికో వద్దకు వెళ్లి నేలపై పడుకుని తాను వెంట తీసుకువెళ్లిన బ్లేడ్‌తో ఎడమ చేతి మణికట్టు కోసుకున్నారు. విషయం దూరం నుంచి గమనించిన సెక్యూరిటీ సిబ్బంది పరుగున వచ్చి 'ఏం చేస్తున్నావంటూ' ప్రశ్నించగా తన ఆవేదన వెళ్లగక్కుతూ దళితుడినైన తన పట్ల కమిషనర్ సాయికాంత్‌వర్మ నిరంకుశంగా వ్యహరిస్తుండడం వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని గట్టిగా అరవడం ప్రారంభించారు. సెక్యూరిటీ సిబ్బంది అవుట్ గేట్ వద్దకు తీసుకువెళ్లగా అక్కడ రోడ్డుపై పడుకుండిపోయారు. దీంతో కొంతమంది వచ్చి శివ ఆదిమూర్తిని వీడియో తీస్తూ ఆత్మహత్యకు కారణాలు ఏమిటని అడగడం ప్రారంభించారు. కొందరు 108కి ఫోన్ చేయడంతో అంబులెన్స్ వచ్చి కేజీహెచ్‌కు తీసుకువెళ్లింది.

నూకాంబిక భక్తుల మాలధారణ ప్రారంభం


మాలధారణ చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏప్రిల్ నెలలో జరగనున్న సందర్భంగా భక్తులు మాలధారణ చేయడం ప్రారంభించారు. బుధవారం నూకాంబిక అమ్మవారి మాలధారణ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ ఆవరణలోని పొంగల్ షెడ్డులో ఆలయం సెట్ ఏర్పాటు చేసి గురుస్వామి పోలిమేర శ్రీను ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర కాయకల్ప బృందం


వైద్యాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర కాయకల్ప బృందం సభ్యులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని బుధవారం కాయకల్ప రాష్ట్ర బృంద సభ్యులు డాక్టర్ శ్రీనివాసవర్మ, రూపస్‌పాల్‌లు తనిఖీ చేశారు. వైద్యాలయంలో రోగులకు అందుతున్న సేవలు, శానిటేషన్, పరిశుభ్రత, ఆస్పత్రిలో రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. అలాగే అన్ని విభాగాలను వారు తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ బాగుందని బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో బృందం వెంట నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.కేజియా, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

22 గంజాయి వాహనాలు వేలం

» రాష్ట్రంలో ఇదే తొలిసారి

» ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి


గంజాయి కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్న ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి, ఇతర అధికారులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 28: గంజాయి కేసుల్లో సీజ్ చేసిన 22 వాహనాలకు నర్సీపట్నం ఎస్‌ఈబీ కార్యా లయం వద్ద బుధవారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్, డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి మాట్లా డుతూ, గంజాయి రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం వేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారి అని చెప్పారు. 2022లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చి గెజిట్ ప్రకారం కోర్టు అనుమతితో డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ ఆధ్వర్యంలో గంజాయి కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలకు వేలంపాట నిర్వహించామన్నారు. మొత్తం 22 వాహనాలను వేలం వేయగా వీటిలో తొమ్మిది వాహనాలు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పట్టుబడినవని తెలిపారు. వేలంపాట ద్వారా రూ.7,14,300, జీఎస్టీ 1,33,614 కలిపి రూ.8,75,914లు ఆదాయం వచ్చిందని ఆయన చెప్పారు. ఆయా గంజాయి కేసులు కొలిక్కి వరకు వేలంపాట ద్వారా వచ్చిన సొమ్మును డీడీ రూపంలో కోర్టు ఆధీనంలో ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, పాడేరు ఎక్సైజ్ సూపరింటెండెంట్లు జైసింహచౌదరి, ఎస్.శ్రీనివాసరావు, నర్సీపట్నం సెబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

3న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహా గర్జన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: విశాఖపట్నం జీవీఎంసీ ఎదుట మహాత్ముని విగ్రహం వద్ద మార్చి మూడో తేదీన జరిగే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహా గర్జనను విజయవంతం చేయాలని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, సీహెచ్. శివాజీ పాల్గొన్నారు.

అనకాపల్లి నియోజకవర్గం

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



బాబాను దర్శించుకుంటున్న రత్నాకర్ తదితరులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 : వేల్పుల వీధిలోని షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు జరిపారు. టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు, మద్దుల వేణుకుమార్, తోలేటి బుచ్చిబాబు, కొత్త గోపాలకృష్ణ, మత్స్యలింగంలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన టైటిలింగ్ యాక్టుకు నిరసనగా ఇక్కడి కోర్టు వద్ద న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం 63వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో న్యాయవాదులు డి.సత్యనారాయణ, మైఖేల్ కూర్చున్నారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి ఆధ్వర్యంలో ఈ దీక్షలు కొనసాగుతున్నాయి.

పత్తిపాడు సభకు కొణతాల, జనసైనికులు



బ్రోచర్లతో కొణతాల, జనసేన నాయకులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 : పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం పత్తిపాడులో బుధవారం జరిగిన టీడీపీ, జనసేన ఉమ్మడి బహిరంగ సభకు జనసేన అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జనసైనికులు భారీగా తరలి వెళ్లారు. బహిరంగ సభ బ్రోచర్‌ను కొణతాల రామకృష్ణతో పాటు కార్యకర్తలు చేతపట్టి కార్లల్లో పెద్ద ఎత్తున పయనమయ్యారు.

ఘనంగా జాతీయ సైన్స్ డే

▸ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలు

▸ వివిధ రకాల నమూనాలు తయారు చేసి ప్రశంసలు అందుకున్న విద్యార్థులు



సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ వైకుంఠరావు



కశింకోట డీపీఎన్ హైస్కూల్‌లో రామన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి



కశింకోటలోని పాఠశాలలో విద్యార్థినులు తయారు చేసిన సైన్స్ నమూనాలు



సబ్బవరం మండలంలోని గుల్లేపల్లి పాఠశాలలో..

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 : జాతీయ సైన్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శనగా ఉంచారు. ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా తొలుత సీవీ రామన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పూలమాల వేసి నివాళులర్పించారు. సైన్స్, టెక్నాలజీకి సంబంధించి కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ విద్యార్థులు వివరించారు. ప్రిన్సిపాల్ వైకుంఠరావు, డాక్టర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: ఇక్కడి డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలులో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎంఆర్‌వీ అప్పారావు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని పలు పాఠశాలల్లో ఈ వేడుకలను జరిపారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శనగా ఉంచారు. ఈ వేడుకల్లో గ్రంథాలయాధికారి కొణతాల జగన్నాథం, ఉపాధ్యాయులు ఎం.ధనుంజయ్, కె.సెల్లై, కె.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. గుల్లేపల్లిలోని పాఠశాలలో జరిగి వేడుకలకు ఎంఈవో ఎస్.లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలను పరిశీలించి, అభినందించారు. ఉపాధ్యాయులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'పల్స్‌పోలియో విజయవంతం కావాలి'

కశింకోట, ఫిబ్రవరి 28 : పల్స్‌పోలియో కార్యక్రమంపై ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో బుధవారం సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ మార్చి 3న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో కశింకోట పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియోచుక్కలు వేసేందుకు 41 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి ఇంటికీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, పారా మెడికల్ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు వెళ్లి పిల్లలకు చుక్కలు వేయాలన్నారు. తొలిరోజు అందుబాటులో లేని వారిని గుర్తించి 4, 5తేదీల్లో వేయాలని సూచించారు. ఇటుక బట్టీల్లో కూడా బృందాలు సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు.

కోలాటం పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న టీడీపీ నాయకుడు కూండ్రపు మధు

పరవాడ, ఫిబ్రవరి 28 : మండలంలోని వాడచీపురుపల్లి రామచంద్రమ్మ అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కోలాటం పోటీల్లో విజేతలకు మంగళవారం రాత్రి బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో ముత్యాలమ్మపాలెం నవదుర్గ కోలాట బృందం ప్రథమ స్థానంలో నిలువగా, పెదగంట్యాడకు చెందిన వెంకటేశ్వర సాయిదుర్గ కోలాట బృందం ద్వితీయ, కాకరాపల్లికి చెందిన సీతారామ కోలాట బృందం తృతీయ, పెద సంపతిపురానికి చెందిన జైశ్రీరామ్ కోలాట బృందం చతుర్థ స్థానంలో నిలిచాయి. వీరందరికీ వరుసుగా రూ. పది వేలు, రూ. ఎనిమిది వేలు, రూ.ఆరు వేలు, రూ.నాలుగు వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, టీడీపీ నాయకుడు కూండ్రపు మధు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిజం గెలవాలి

... 5వ పేజీ తరువాయి

రావికమతం మండలం గంపవానిపాలెంలో పెద్దిమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తారు.

ఎలమంచిలి నియోజకవర్గంలో...

నారా భువనేశ్వరి గురువారం సాయంత్రం ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలానికి చేరుకుంటారు. అరబుపాలెంలో బడ్డేడ నాయుడు కుటుంబాలను, వాడ్రాపల్లిలో ఉల్లూరి అప్పలనరస, ఊల్లూరి మంగయ్యమ్మ కుటుంబాలను, గొల్లలపాలెంలో మొల్లి అప్పలనరస కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం అనకాపల్లి చేరుకొని రాత్రి విడిది చేస్తారు. శుక్రవారం ఉదయం 10.40 గంటలకు మునగపాక మండలం కాకరాపల్లి వెళ్లి వాసా అప్పారావు కుటుంబాన్ని పరామర్శిస్తారు.

అనకాపల్లి పట్టణంలో...

భువనేశ్వరి మునగపాక మండల పర్యటన తరువాత మధ్యాహ్నం 12.25 గంటలకు అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం చేరుకుని ముత్తుర్తి వెంకటరావు కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. అనంతరం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకొని హైదరాబాద్ బయలుదేరి వెళతారు. కాగా నారా భువనేశ్వరి పర్యటన సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ప్రగడ నాగేశ్వరరావు (ఎలమంచిలి), బత్తుల తాతయ్యబాబు (చోడవరం), పీలా గోవింద సత్యనారాయణ (అనకాపల్లి) ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కేంద్రాలకు సమీపంలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంట్ అధికారితోపాటు రెండు ఫ్లయింగ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షా కేంద్రాల్లోకి అర గంట ముందు నుంచే విద్యార్థులను అనుమతిస్తారు. నిర్ణీత సమయం (9 గంటలు) దాటిన తరువాత పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించరు.

గిరిజనుల అభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి

... 5వ పేజీ తరువాయి

ఫోన్ చేసి దాదాపు పావు గంట సేపు అరకులోయ ప్రాంతంలో చేసిన అభివృద్ధి, అరకు కాఫీ గురించి వివరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి సియ్యారి దొన్నుదొర, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు అధిక సంఖ్యలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.

పెందుర్తి నియోజకవర్గం

గణపతిపురం ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



మల్లికార్జున స్వామి మూల విరాట్

సబ్బవరం, ఫిబ్రవరి 28 : గణపతిపురంలో బుధవారం గణపతి భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. వేదపండితులు తేజశర్మ బృందం ఆధ్వర్యంలో ఈ వేడుకను జరిపించారు. గణపతి, నందీశ్వరుడు, కాలభైరవస్వామి విగ్రహాలను తొలుత ఊరేగించి ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు రూ.లక్ష చొప్పున విరాళాలను ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, వీకేపీసీ పీబిఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద తదితరులు పాల్గొన్నారు.

పోతురాజు విగ్రహం నిర్మాణానికి విరాళం

పరవాడ, ఫిబ్రవరి 28 : రావాడ పంచాయతీ జల్లెలపాలెం మరిడిమాంబ ఆలయంలో పోతురాజు విగ్రహం నిర్మాణానికి పరవాడకు చెందిన తేలు చలపతిరావు దంపతులు లక్షా వెయ్యి నూటపదహారు రూపాయలను బుధవారం విరాళంగా అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఆలయ కమిటీ ప్రతినిధులు మేడిశెట్టి మాణిక్యం, సారిపల్లి జోగినాయుడు, మేడిశెట్టి సోమునాయుడు, పీతాని అప్పారావు, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

వారపుసంత ఆశీల వేలం ఖరారు

పరవాడ, ఫిబ్రవరి 28 : మండల కేంద్రం పరవాడలో ప్రతి మంగళవారం జరిగే వారపుసంతలో ఆశీల వసూలుకు సంబంధించి బుధవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఇన్‌చార్జి పంచాయతీ విస్తరణాధికారి అచ్యుతరావు పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రక్రియకు 19 మంది పాటదారులు హాజరుకాగా, రావాడ పంచాయతీ కొత్త వెన్నెలపాలెం గ్రామానికి చెందిన జాగవరపు మంగరాజు రూ.2.76 లక్షలకు సంతపాటను దక్కించుకున్నారు. సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పింఛనర్ల సమావేశంలో చర్చ

పరవాడ, ఫిబ్రవరి 28 : ఇక్కడి మరిడిమాంబ కల్యాణ మండపంలో బుధవారం పరవాడ మండల ప్రభుత్వ పింఛనర్ల వార్షికోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంశాలపై చర్చించారు. 12వ పీఆర్సీ ప్రకటించే వరకు 30 శాతం ఐఆర్ తక్షణమే అమలు చేయాలని, గత పీఆర్సీ 2018 జూలై నుంచి రావాల్సిన ఎరియర్స్ మంజూరు చేయాలని, డీఆర్ ఏరియర్స్ మంజూరు చేయాలని, కోరారు. సంఘం వ్యవస్థాపకులు బొండా అప్పారావు, అధ్యక్షులు ఆదిరెడ్డి సన్నిబాబు, ప్రధాన కార్యదర్శి దీక్షితులు, సన్యాసిరావు, పైడిరావు, కృష్ణమూర్తి, ప్రసాదరావు, రాజేష్ పాల్గొన్నారు.

ఎలమంచిలి నియోజకవర్గం



ప్రజావేదికపై ఉపాధి పథకం పనుల తనిఖీల వివరాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

ఉపాధిలో తప్పులు జరగకుండా చూడండి: ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి, ఫిబ్రవరి 28: ఉపాధి హామీ పథకం పనుల్లో ఎటువంటి తప్పులు జరగకుండా చూడాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు ఆదేశించారు. మండల కేంద్రంలో బుధవారం ఉపాధి పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 30 పంచాయతీల్లో రూ.7 కోట్లతో చేసిన పనులపై చేపటిన తనిఖీలకు సంబంధించిన నివేదికను డీఆర్పీలు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన వేతనదారులకు తప్పకుండా పనులు కల్పించాలన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏషియన్ పెయింట్స్ కంపెనీ ద్వారా అభివృద్ధి చేసిన చెరువులు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ ఈ.సందీప్, ఎంపీడీవో వెంకటాచలం, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, ఎంపీపీ జి.శిరీషా, జడ్పీటీసీ సభ్యుడు డి.నాగరాజు, వైసీపీ మండల కన్వీనర్ జి.శ్రీనుబాబు, ప్రజా ప్రతినిధులు, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యకు ప్రోత్సాహం

రాంబిల్లి, ఫిబ్రవరి 28: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యకు ప్రభుత్వం అధిక ప్రోత్సాహం ఇస్తున్నదని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద రూ.15 లక్షలతో నిర్మించనున్న లేబొరేటరీ గది పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కొండలదేవునిపాలెంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన వాటర్‌ట్యాంక్, కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా నీటి ట్యాంకులు, కుళాయిలు ఏర్పాటు చేసి ఇంటింటికీ నీరు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, ఎంపీపీ జి.శిరీషా, జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, సచివాలయ మండల కన్వీనర్ కె.రామకృష్ణ, వైసీపీ మండల కన్వీనర్ పి.కిశోర్ పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 : టైలర్స్ డేను బుధవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక అగ్గిమర్రిచెట్టు ప్రాంతానికి చెందిన సీనియర్ టైలర్ కొమ్మనాపల్లి పోతురాజు, బీఆర్టీ కాలనీకి చెందిన మరో సీనియర్ టైలర్ యల్లపు వెంకటరావులను న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.మహేష్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. బాబీతో పాటు బీఆర్టీ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ఎలమంచిలి/రాంబిల్లి/నక్కపల్లి/ఎస్.రాయవరం/కోటవురట్ల/అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 28: ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఎలమంచిలి జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. హెచ్‌ఎం శాస్త్రి పర్యవేక్షణలో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి 16 ఎగ్జిబిట్స్‌ను రూపొందించి ప్రదర్శించారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన సైన్స్ ప్రదర్శనలో ఇదే స్కూలు విద్యార్థి రూపొందించిన నమూనా రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఎంపిక కావడం విశేషం. అలాగే పీఎన్‌ఆర్.పేట పాఠశాలలో హెచ్‌ఎం వరలక్ష్మి ఆధ్వర్యంలో సైన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సర్ సివి.రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సత్యనారాయణ, స్థానిక నేతలు గొన్నాబత్తుల శివ, శేఖర్ పాల్గొన్నారు. అచ్యుతాపురం మండలంలోని కైట్స్ విద్యా విహార్, భవానీ విద్యానికేతన్ పాఠశాలలో సైన్సు ఎగ్జిబిషన్ నిర్వహించారు. అనకాపల్లి డీఎస్పీ కేవీ సత్యనారాయణ పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన 120 ప్రాజెక్టులను తిలకించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభను, శాస్త్రీయ విజ్ఞానాన్ని కొనియాడారు. కార్యక్రమంలో బార్క్ శాస్త్రవేత్త సుబ్రజిత్ గుయర్న్, ఎంఈవో దేవరాయల్, నాయకులు కోన బుజ్జి, కె.వెంకునాయుడు, ధర్మిరెడ్డి నాయుడుబాబు(డ్రీమ్స్), డాక్టర్ వెంకట్, జగదీష్, కరస్పాండెంట్లు రెడ్డి చిరంజీవి, రెడ్డి గణేష్, రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు. రాంబిల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్, పేరెంట్స్ కమిటి చైర్మన్ వర్మరాజు సివి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ పరికరాలను పరిశీలించి అభినందించారు.



అచ్యుతాపురంలోని విద్యావిహార్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

నక్కపల్లి మండలంలోని వేంపాడు, చినదొడ్డిగల్లు, నక్కపల్లి, గొడిచెర్ల, రాజయ్యపేట, జానకయ్యపేట, దేవవరం హైస్కూళ్లలో సైన్స్ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు చేసిన పలు సైన్స్ ప్రయోగాలు, ప్రాజెక్టులు విశేషంగా అలరించాయి. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని హెచ్‌ఎంలు చెప్పారు.

ఎస్.రాయవరం మండలంలోని పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించారు. మెజీషియన్ మావూరు శ్రీనివాసరావు మరుగుతున్న వేడి నూనెలో వేగిన బజ్జీలను చేతితో తీయడమే కాకుండా వేడి నూనెలో నుంచి బజ్జీలు ఎలా తీయాలో చూపారు. దాని వెనుక ఉన్న సైన్స్ ఏమిటన్నది విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ పాల్గొన్నారు.

కోటవురట్ల మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. రాజుపేట పాఠశాలలో సైన్సు ప్రాముఖ్యతపై చర్చించారు. విద్యార్థులు తయారుచేసిన నమునాలను నక్కపల్లి సీఐ అప్పన్న పరిశీలించి అభినందించారు. కోటవురట్ల, కె.వెంకటాపురం ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన విద్యార్థుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.





ఎస్.రాయవరంలోని పెదగుమ్ములూరు పాఠశాలలో వేడి నూనెలో బజ్జీ తీస్తున్న మెజిషియన్... నక్కపల్లి: చిన్నదొడ్డిగల్లులో విద్యార్థులు తయారు చేసిన క్షిపణి ప్రయోగం

సంప్రదాయ దుస్తులను ఆదరించాలి

▸ టైలర్ల కో- ఆపరేటివ్ సొసైటీ మండల అధ్యక్షుడు సత్తిబాబు



ఎలమంచిలిలో ర్యాలీ చేస్తున్న టైలర్లు

ఎలమంచిలి, ఫిబ్రవరి 28: సంప్రదాయ దుస్తులకు ఆదరింఇ పూర్వవైభవం తీసుకురావాలని టైలర్ల కోఆపరేటివ్ సొసైటీ మండల అధ్యక్షుడు వియ్యపు సత్తిబాబు కోరారు. ఎలమంచిలి పట్టణంలో అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భగా టైలర్లంతా కలిసి కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హావే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీవీ కాంప్లెక్సు జంక్షన్ నుంచి బస్టాండ్ జంక్షన్ మీదుగా దిమిలి రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సత్తిబాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది కుటుంబాల ప్రజలు కుట్టుమిషను జీవనాధారంగా కాలం వెల్లదీస్తున్నారన్నారు. మారుతున్న కాలంతో పాటు రెడీమెడ్ రంగం కారణంగా కాస్త వెనుకబడినప్పటికీ సంప్రదాయ దుస్తుల వినియోగానికి మాత్రం ఆదరణ తగ్గలేదన్నారు. అనంతరం టైలర్ల సంఘాభివృద్ధికి అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో పలు టైలర్ల సంఘాల ప్రతినిధులు అంది మహేష్, డి.శేషుబాబు, పిల్లా శివ, మల్ల నాగేశ్వరావు, వెంకటరావు, జి.అప్పారావు, కె.సత్యనారాయణ, కె.భద్రరావు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలో టైలర్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పాయకరావుపేట టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టైలర్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నేత బి.రమణ మాట్లాడుతూ టైలర్లు ఆర్థికంగా నిలబడేందుకు బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు, చేయూత సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే సీనియర్ దర్జీలకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు దాసరి రమణ, రంగబాబు, గణేష్, ఆది పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు కంప్యూటర్, స్కానర్ వితరణ

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 28: పెదరాంభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రవాసాంధ్రులు నోరి నరసింహం, నోరి లక్ష్మీమంగ దంపతులు కంప్యూటర్, స్కానర్, లేజర్ ప్రింటర్, టేబుల్, కుర్చీలను వితరణ చేశారు. వీటిని ఉప విద్యా శాఖాధికారి పెన్నాడ అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు విన్నపం మేరకు రూ.1.5 లక్షల విలువైన సామగ్రిని దాతలు అందించడం ఆనందకరమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా చంటిపాప

కోటవురట్ల, ఫిబ్రవరి 28: ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి అనకాపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా ఎత్తుల చంటిపాప అలియాస్ మేరి నియమితులయ్యారు. మండల కేంద్రమైన కోటవురట్ల గ్రామానికి చెందిన దళిత మహిళ చంటిపాపను నియమిస్తూ ఈ మేరకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి అధ్యక్షుడు బీరాజురావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చంటిపాప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందేలా కృషిచేస్తానని చెప్పారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు.

పెదతీనార్లలో బోరు ప్రారంభం

నక్కపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని పెదతీనార్ల మత్స్యకార గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు నిధులతో కొత్తగా నిర్మించిన మంచినీటి బోరును బుధవారం ప్రారంభించారు. నీటి ఎద్దడి నివారణకు మండల పరిషత్ నిధులను వెచ్చిస్తున్నామని ఈ సందర్భంగా నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, స్థానిక నేతలు జి.చినతాతారావు, పి.దేవుడు, కె.వెంకటరమణ, ఎ.చిట్టిబాబు, ఎం.జగ్గా, వి.సత్యం పాల్గొన్నారు.

పాయకరావుపేట నియోజకవర్గం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు... (ఇన్‌సెట్‌లో) ప్రతిష్ఠ అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న విఘ్నేశ్వరుడు

నేత్రపర్వంగా విఘ్నేశ్వర ఆలయ ప్రారంభోత్సవం

నక్కపల్లి, ఫిబ్రవరి 28: మండల కేంద్రమైన నక్కపల్లి వీవర్స్ కాలనీలో నిర్మించిన విఘ్నేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నేత్రపర్వంగా సాగాయి. నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. బుధవారం ఉదయం ధ్వజస్తంభం, ఆలయ ప్రారంభోత్సవం, కలశ ప్రతిష్ఠ, విఘ్నేశ్వరస్వామి, భక్త మార్కండేయ, సరస్వతి దేవివిగ్రహాల ప్రతిష్ఠాపనలు అంగరంగవైభవంగా జరిగాయి. ముందుగా ఆలయంలో స్వామివారిని గోమాత దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం వేల సంఖ్యలో భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, వేదపండితులు పీసపాటి శేషాచార్యులు, కుమారస్వామి శర్మ నేతృత్వంలో ఆలయ ప్రారంభోత్సవం, దేవతామూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయం పక్కన ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం జరిపించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

టీడీపీ సూపర్-6 పథకాలపై ప్రచారం



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే పేదల కోసం అమలుచేయనున్న సూపర్-6 పథకాలపై పాయకరావుపేటలో నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో నాయకులు పాత హరిజనవాడ, తోకలవారివీధి, ఏటిఒడ్డువీధి తదితర ప్రాంతాల్లో బుధవారం ఇంటింటికీ తిరిగి పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే చేకూరే లబ్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరుకూరి పేర్రాజు, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణం నడిబొడ్డున మందేస్తూ.. చిందేస్తూ..!

▸▸ చోడవరం ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో మందుబాబుల ఆగడాలు
▸▸ ఆందోళన చెందుతున్న పరిసరాల నివాసితులు ▸▸ పట్టించుకోని పోలీసులు


కార్యాలయం ఆవరణలో మందుబాబులు తాగి పడేసిన మద్యం సీసాలు


చోడవరంలోని ఇరిగేషన్ కార్యాలయం

చోడవరం, ఫిబ్రవరి 28 : పట్టణంలోని కో- ఆపరేటివ్ కాలనీ కోనాం అతిథి గృహానికి సమీపంలో గల ఇరిగేషన్ కార్యాలయం ఆవరణ మందు బాబులకు అడ్డాగా మారింది. ప్రతి రోజూ రాత్రి వేళ ఇక్కడ పలువురు మందు పార్టీలతో చేస్తున్న హడావిడితో స్థానికులను భయాందోళనకు గురిచేస్తుంది. చోడవరం నడిబొడ్డున ఉండడంతో రోజూ చీకటిపడగానే ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఎవరూ ఉండ క పోవడంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండాపోతోందని స్థానికులు వాపోతున్నారు. రాత్రంతా మందు తాగుతూ, వారు వేస్తున్న అరుపులు కేకలతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని పరిసర నివాసాల్లోని మహిళలు వాపోతున్నారు. రోజు రోజు ఈ సమస్య మరింత పెరిగిపోతున్నట్టు చెపుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి ఇరిగేషన్ కార్యాలయం పరిసరాల్లో మందుబాబుల ఆగ డాలకు అడ్డుకట్ట వేయాలని అంతా కోరుతున్నారు.

రాళ్లు తేలిన రోడ్డుపై రాకపోకలకు అవస్థలు

▸▸ దారుణంగా తయారైన ఘాట్‌రోడ్డు జంక్షన్- కింతలి మార్గం


జమ్మాదేవిపేట వద్ద రోడ్డుపై రాళ్లు తేలిన దృశ్యం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 28 : మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి గ్రామం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి దారుణంగా మారింది. ఈ మార్గంలో వాడపాడు, జంపెన, గాదిరాయి, వమ్మలి, వీజేపురం, జమ్మాదేవిపేట, పొంగలిపాక, జాలంపల్లి, లోవ పొన్నవోలు, కింతలి వల్లాపురం, కింతలి తదితర గ్రామాల ప్రజల నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ట్రాక్టర్లు, లారీలు, వ్యాన్‌లు, ఇతరత్రా వాహనాలు తిరుగుతుంటాయి. గత ఏడాది జూలై నెలలో రోడ్డు పగుళ్లు, రోడ్డుపై పెచ్చులను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలిగించారు. రోడ్డుపై వర్షం నీరు నిలవకుండా రోడ్డు అంచులు వద్ద తుప్పలు తొలగించారు. అయితే క్రషర్ బుగ్గితో గుంతలు పూడ్చించారు. వాహనాల రాకపోకలకు రోడ్డుపై కంకర రాళ్లు పైకి తేలాయి. దీనికితోడు గుంతలు ఏర్పడ్డాయి.

పెద్ద వాహనాలు వెళితే రోడ్డంతా దుమ్మి, ధూళి కమ్మేస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, జంపెన, గాదిరాయి, వమ్మలి, జమ్మాదేవిపేట గ్రామాలతో పాటు పలు చోట్ల రోడ్లుగుంతలు పడి, రాళ్లపైకి తేలి మరింత అధ్వానంగా మారాయి. ఇటువంటి రహదారులపై ప్రయాణాలు చేస్తుండడం వల్ల వాహనాల టైర్లు దెబ్బతింటున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. కాగా, ఇటీవల ఈ రోడ్డు నిర్మాణానికి ఆర్అండ్‌బీ నిధులు రూ.తొమ్మిది కోట్లు మంజూరయ్యాయి. తవ్విన పాత రోడ్డుపై రోలింగ్ పనులు చేపట్టారు. రోలింగ్ చేసినప్పటికీ తారు పెచ్చులు, రాళ్ల రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. వాహనాలపై వెళ తుంటే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కొత్తగా రోడ్డు వేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా అంతా కోరుతున్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కేంద్రాలకు సమీపంలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంట్ అధికారితోపాటు రెండు ఫ్లయింగ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షా కేంద్రాల్లోకి అర గంట ముందు నుంచే విద్యార్థులను అనుమతిస్తారు. నిర్ణీత సమయం (9 గంటలు) దాటిన తరువాత పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించరు.

గిరిజనుల అభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి

... 5వ పేజీ తరువాయి

ఫోన్ చేసి దాదాపు పావు గంట సేపు అరకులోయ ప్రాంతంలో చేసిన అభివృద్ధి, అరకు కాఫీ గురించి వివరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి సియ్యారి దొన్నుదొర, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు అధిక సంఖ్యలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.

నిజం గెలవాలి

... 5వ పేజీ తరువాయి

రావికమతం మండలం గంపవానిపాలెంలో పెద్దిమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తారు.

ఎలమంచిలి నియోజకవర్గంలో...

నారా భువనేశ్వరి గురువారం సాయంత్రం ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలానికి చేరుకుంటారు. అరబుపాలెంలో బడ్డేడ నాయుడు కుటుంబాలను, వాడ్రాపల్లిలో ఉల్లూరి అప్పలనరస, ఊల్లూరి మంగయ్యమ్మ కుటుంబాలను, గొల్లలపాలెంలో మొల్లి అప్పలనరస కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం అనకాపల్లి చేరుకొని రాత్రి విడిది చేస్తారు. శుక్రవారం ఉదయం 10.40 గంటలకు మునగపాక మండలం కాకరాపల్లి వెళ్లి వాసా అప్పారావు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శిస్తారు.

అనకాపల్లి పట్టణంలో...

భువనేశ్వరి మునగపాక మండల పర్యటన తరువాత మధ్యాహ్నం 12.25 గంటలకు అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం చేరుకుని ముత్తుర్తి వెంకటరావు కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. అనంతరం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకొని హైదరాబాద్ బయలుదేరి వెళతారు. కాగా నారా భువనేశ్వరి పర్యటన సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ప్రగడ నాగేశ్వరరావు (ఎలమంచిలి), బత్తుల తాతయ్యబాబు (చోడవరం), పీలా గోవింద సత్యనారాయణ (అనకాపల్లి) ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కండి

▸▸ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ▸▸ మాడుగులలో ఈవీఎంలు భద్రపర్చే గదులు, సిబ్బంది బసచేసే అతిథిగృహం తనిఖీ


ఈవీఎంలు భద్రపర్చే గదిని పరిశీలిస్తున్న దృశ్యం


ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

మాడుగుల, ఫిబ్రవరి 28 : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. మాడుగులలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత తాచేరు కాలువ వద్ద నూతనంగా నిర్మించిన అతిథి గృహాన్ని పరిశీలించారు. ఎన్నికల సమయంలో విధులకు విచ్చేసే అధికారులు, అబ్జర్వర్లు ఉండేందుకు అనువైన వాతావరణం, వసతులపై ఆరా తీశారు. ఎన్నికల అనంతరం సెయింటాన్స్ పాఠశాలలో ఈవీఎంలను భద్రపరిచే గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. వాటికి ఏ మేరకు భద్రత ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల నిర్వహణ, పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు తదితరాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, డీఎస్పీ సుబ్బరాజు, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డీవీ సత్యవాణి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఆర్‌వీ రమణ, కోటపాడు సీఐ స్వామినాయుడు, ఎస్ఐ దామోదరనాయుడు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజా, చోడవరం డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ మీనా కుమారి, ఆర్ఐ లక్ష్మయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

అయ్యన్న సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక


తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 28 : గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురంలోని వైసీపీ, సీపీఐలకు చెందిన పది కుటుంబాల వారు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. వీరికి కండువాలను కప్పి అయ్యన్న పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. మాజీ సర్పంచ్ కొలగాని రామారావు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ రఘురామచంద్రరావు విధానాలు నచ్చక వీరంతా పార్టీలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగాపురం మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, నాయకులు బొప్పన ప్రసాద్, కలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండా చక్కగా పరీక్షలు రాయండి

▸▸ పదో తరగతి విద్యార్థులకు డిప్యూటీ డీఈవో అప్పారావు సూచన


పదో తరగతి విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

రోలుగుంట, ఫిబ్రవరి 28 : పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా రాసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావు సూచించారు. మండలంలోని బుచ్చెంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎప్పటికప్పుడు వారి సందేహాలను నివృత్తి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి, వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జగ్గారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం


గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు

కె.కోటపాడు, ఫిబ్రవరి 28 : మండల కేంద్రం కె.కోటపాడులో గౌరీ పరమేశ్వర ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా వేకువజామునుంచి ఆదిదంపతులకు విశేష పూజలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం మహిళలు అమ్మవారికి సారెను సమర్పించారు. తొలుత మేళతాళాలు, బాజభజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండివంటలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వచ్చి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రసాదంగా పంచిపెట్టారు. గౌరీ సంఘం ప్రతినిధులు శరగడం సన్యాసినాయుడు, కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చోడవరంలో పారిశుధ్య కార్మికులు నిరాహార దీక్ష

▸▸ ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్


పంచాయతీ కార్యాలయం వద్ద దీక్ష చేపడుతున్న పారిశుధ్య కార్మికులు

చోడవరం, ఫిబ్రవరి 28 : వేతన బకాయిల కోసం చోడవరం పంచాయతీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఆరు నెలలుగా తమకు వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. చెల్లించేదే అరకొర అని, అవికూడా సకాలంలో ఇవ్వకుంటే కుటుంబాలను ఎలా పోషించాలని ప్రశ్నించారు. తమ సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించకపోవడంతో నిరాహార దీక్షలకు దిగాల్సి వచ్చిందని వాపోయారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటాన్ని ఆపేదీ లేదని వారంతా స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం ప్రతినిధులు పొట్నూరు అప్పారావు, గణేష్, అప్పలరాజు, నాగు, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ పథకాలపై విస్తృత ప్రచారం


పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు

రావికమతం, ఫిబ్రవరి 28 : 'జనంలోకి మనం' పేరుతో పోస్టల్ శాఖలో ఉన్న మేలైన పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్టు నర్సీపట్నం సౌత్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆ శాఖ రావికమతం సిబ్బందితో కలిసి బుధవారం ఇక్కడ ఇంటింటికీ వెళ్లి పోస్టాఫీసుల్లో ప్రజల కోసం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. ఎస్సీ కాలనీలో ప్రజలతో ఆయన మాట్లాడుతూ ఆధార్, మొబైల్ నెంబర్ ఉంటే పోస్టాఫీసులో వెనువెంటనే ఖాతా ప్రారంభిస్తామని చెప్పారు. అంతేకాకుండా ఇక్కడ దాచుకున్న డబ్బులకు ఇతర బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ ఇస్తామని, ఇన్సూరెన్స్ సౌకర్యం,హెల్త్, వాహనా ఇన్సూరెన్స్‌లు కూడా అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెయిల్ అధికారి కె.శ్రీనివాసరావు ,సిబ్బంది పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద ధ్వజస్తంభం ఏర్పాటుకు పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

నాతవరం, ఫిబ్రవరి 28 : మండలంలోని చమ్మచింత ఉత్తరవాహిణి వద్ద గల కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణేశ్వరి ఆలయంలో బుధరం ధ్వజస్తంభం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తొలుత ఆది దంపతులకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గత రెండు రోజులుగా హోమాలు జరుపుతున్నారు. అలాగే దేవాలయంలో నూతనంగా అన్నపూర్ణదేవి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 షైనం నాగ గోపీ, మాజీ ఎంపీటీసీ కె.నూకరాజు, విజయ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 28 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. సీసీ కెమెరాలను సిద్ధం చేశారు. స్థానిక విద్యార్థులతో పాటు గొలుగొండ గురుకుల, కస్తూర్బా గాంధీ కళాశాల, ఎల్ఎస్ఎం నాయుడు ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన 479 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు సూచించారు.

ఘనంగా టైలర్స్ దినోత్సవం


వేడుక జరుపుకుంటున్న టైలర్లు

దేవరాపల్లి, ఫిబ్రవరి 28 : టైలర్స్ దినోత్సవాన్ని బుధవారం ఇక్కడి రాయపురెడ్డి వారి తోటలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ రడీమేడ్ ధాటికి తమ బతుకులు భారంగా మారాయన్నారు. ప్రభుత్వాలు తమను ఆదుకునేందుకు కృషి చేయాల్సిందిగా కోరారు. అనంతరం సమస్యలపై అంతా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప్పు శంకర్, ప్రసాద్, శ్రీను, మాదానశ్రీను, గణేష్, దేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 28 : ఇక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం గౌతమి లలితా కళాక్షేత్ర శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎనభై మంది విద్యార్థులు అందమైన చిత్రాలను వేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అచ్చుతరామయ్య, ఉపాధ్యాయులు ఎం.శేషగిరిరావు, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు విజేతలకు బహుమతులు


విజేత జట్టుకు నగదు బహుమతి అందిస్తున్న ప్రతినిధులు

మాడుగుల, ఫిబ్రవరి 28 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ తీర్థం సందర్భంగా పోలీస్ డ్రిల్ మైదానంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఉత్సాహభరింత వాతావరణంలో సాగాయి. ఇందులో విజేతలకు ఎన్టీఆర్ కళాక్షేత్రం వేదికపై ఆలయ కమిటీ నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు శ్రీనాథు శ్రీనివాసరావు, కొట్యాడ మల్లికార్జునరావు, ధర్మిశెట్టి అప్పలనాయుడు, అవినాష్ పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


గౌరీపట్నం హైస్కూల్‌లో విద్యార్థినులు తయారు చేసిన నమూనాలు


రావికమతం మండలం చినపాచిల హైస్కూల్‌లో...


దేవరాపల్లి : కాశీపురం పాఠశాలలో రామన్ చిత్రపటం వద్ద నివాళి


చీడికాడ మండలం మంచాల మోడల్ కళాశాలలో...


రోలుగుంట మండలం కుసర్లపూడి పాఠశాలలో...


మాకవరపాలెం మండలం తూటిపాల పాఠశాలలో...

చోడవరం, ఫిబ్రవరి 28 : సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా బుధవారం పలు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల విద్యారులు తమ మేధస్సుకు పదునుపెట్టే విధంగా సైన్స్ అంశాలకు సంబంధించి పలు ప్రాజెక్టులను ప్రదర్శనల్లో ఉంచారు. చోడవరం మండలంలోని గౌరీపట్నం, గవరవరం, లక్కవరం, గోవాడ, జుత్తాడ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను అంతా తిలకించారు. తొలుత ఎంఈవో జయలక్ష్మి ప్రారంభిచారు. గౌరీపట్నం హైస్కూల్‌లో విద్యార్థులు హైడ్రాలిక్ బ్రిడ్జ్, సోలార్ సిస్టం, పెరిస్కోపు జీర్ణ వ్యవస్థ తదితర అంశాలతో కూడిన ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. వీటికి జడ్జిగా ఎస్.కె శ్రీను వ్యవహరించారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం, ఎ.కొత్తపల్లితో పాటు వివిధ గ్రామాల్లో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థులు నమూనాలను ప్రదర్శించారు. కాశీపురంలో హెచ్ఎం బి.టి.సుందరి, స్వర్ణలత, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పవన విద్యుత్, సోలార్ విద్యుత్, ట్రాఫిక్ సిగ్నల్స్, ఏటీఎం తదితర యంత్రాలను తయారు చేసి ప్రదర్శనగా ఉంచి ఆకట్టుకున్నారు. హెచ్ఎం రాము, ఉపాధ్యాయులు లోవరాజు, సంతోష్ పాల్గొన్నారు.

రోలుగుంట : కుసర్లపూడి జడ్పీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం మోహనరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొల్లు రాజుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలోని చినపాచిల, కొత్తకోట,టి. అర్జాపురం తదితర గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బయోటాయిలెట్స్, హైడ్రాలిక్ బ్రిడ్జి, సోలార్ స్మార్ట్‌సిటీ, గ్లోబర్ వార్మింగ్, సౌరశక్తితో వ్యవసాయం, తక్కువ ఖర్చుతో ఎల్ఈడీ విద్యుత్ దీపాల వెలుగులు, విండ్ పవర్ ,మానవ భాగాల పనితీరు, పచ్చదనం పరిశుభ్రత, చంద్రయాన్ వంటి పలు నమూనాలను రూపొందించి, వాటి పనితీరును అందరికీ వివరించారు. చినపాచిల ఉప సర్పంచ్ కోమటి శంకరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముచ్చర్ల ధనుంజయరావులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడ : డాక్టర్ సీవీ రామన్‌ను విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకోవాలని మంచాల మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి అన్నారు. జాతీయ సైన్స్ వేడుకల్లో భాగంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.